గూడెంలో అగ్గిపెట్టెల్లాంటి యిళ్ళు కట్టి ఓట్లు దండుకున్న ప్రభుత్వం వాళ్ళకు పని చూపించలెదు, తిండి కల్పించలేదు. అగ్గిపెట్టె కొంపలు వాటి పక్కన యూకలిప్టస్ చెట్లూ తప్ప తింటానికి ఏమీ లేదు గూడెంలో. అందువల్ల తన అత్త, అత్త అత్తా తరతరాలుగా చింతచిగురు కోసుకొచ్చి అమ్మి కొద్ది రోజులు బతుకుతూ వుండేవారని విన్న గూడెం కోడలు చింతాలు ఉరఫ్ చింత చింతచెట్లనే నమ్ముకుంది. అవలీలగా చెట్టెక్కి చింత చిగురు కొయ్యటంలో బహు నేర్పరి చింతాలు.

# చింత చిగురు

## లత

ప్రతి వూర్లోలాగానే ఆ వూళ్ళోనూ ఒకే ఒక బ్రాహ్మణ కుటుంబం వుంది. బ్రాహ్మలు పల్లెటూళ్ళల్లో బ్రతక లేక బస్తీలకు వెళ్ళిపోయారు చాలా మంది. కాని యీ బ్రాహ్మడు పరబ్రహ్మనికి రెండెకరాల చెక్కా ఒక కొంపా వుండి చదువు బొత్తిగా లేకపోవటం వల్ల యజ్ఞోపవీతమాత్ర బ్రాహ్మణుడై అటు రైతూ గాక యిటు బ్రాహ్మణుడూ కాకుండా బతుకుతున్నాడు.

ఊరి పెద్దలు దయదల్చి యిచ్చిన గడ్డి పశువుకీ, ధాన్యం కుటుంబానికీ సరిపోతే తృప్తి పడ్డ బ్రాహ్మణుడు విద్యాదానం చేసి ఋణం తీర్చుకునేవాడు గతంలో. యిప్పుడా పొడిమి చెడిపోయింది కనక రెండెకరాల వ్యవసాయమూ చేతకాక పండీ పండని భూమిలోనూ, కూలిపోయిన కొంపలోనూ కూరుకుపోయాడు పరబ్రహ్మశాస్త్రి.

భగవంతుడి దయ తిన్నగా వుండి ఒక్క ఆడపిల్ల మాత్రం కలిగింది అతనికి. ఆ పిల్ల పేరు శ్రీదేవి. నోరు తిరక్కనో తిరిగో గాని ఆ పిల్లను అందరూ శ్రీ అని పిలుస్తారు. అదుగో అలాంటి సిరికీ చింతాలుకీ తగని స్నేహం. దానికి కారణం సిరి చింత చెట్టు ఎక్కలేదు. చింతాలు ఎక్కగలదు. కూరలు దొరకని ఆ పల్లెటూళ్ళో చింత చిగురు పప్పూ, చింత చిగురు పచ్చడీ ఆ బ్రాహ్మణ కొంపలో తింటూ వుంటారు చిగురు వున్నాళ్ళూ.

సిరికి నీళ్ళతో పాటు చింత చిగురు కూడా తీసుకు రావటం ఒక అలవాటు. యీ చిగిర్చే చింతలు అయిదారు రెడ్డిగారివని రెడ్డిగారూ, చౌదరిగారివని చౌదరి గారూ కొట్లాడుకుంటూ వుండటం కూడా ఆ వూళ్ళో మామూలే. ఏమైనా పేద బ్రతుకులకి యీ చింత చెట్లు కల్పవృక్షాలు.

పరబ్రహ్మశాస్త్రి వాక్యాల్లో చెప్పాలంటే చెచ్చేటి మంచిదై బచ్చలి వుంటేనూ - కూతురు సిరియై చిగురు తెస్తేనూ జీవితం వెళ్ళిపోతుంది. అంతకంటె పెద్ద కోరికలు అతనికి ఏమీ లేవు. నలుపులో అందం చింతాలుది. తెలుపులో సౌందర్యం సిరిది. వీళ్ళిద్దరూ గంటలకొలదీ మాట్లాడుకుంటారు. ఆ విషయంలో అటు గూడెం వాళ్ళు గానీ, యిటు పరబ్రహ్మశాస్త్రి గానీ ఎన్నడూ తప్పు పట్టలేదు. కాని ఆ వూరి మోతుబరి కొడుకు పట్నం నుంచి మోటారుసైకిలు మీద వస్తూ తమ చింతల్ని లూటీ చేస్తున్న చింతాల్నీ, అందుకు ప్రోత్సహిస్తున్న సిరినీ చూసి ఒళ్లు రవల పెట్టుకున్నా వాళ్ళిద్దరి అందమూ చూసి అప్పటికి వెళ్ళిపోయాడు ఎందుకైనా మంచిదని. మర్నాడు చెట్టు మీదకెక్కిన చింతాలూ, చెట్టు కింద సిరీ వూసులాడు కుంటున్న వేళ ఆ వేషగాడు అక్కడికి తయారయ్యాడు. సిరీ అతనూ ఒకే బళ్ళో చదువుకున్నారు. ఆ కారణం పురస్కరించుకొని "సిరీ బాగున్నావా? నువ్వసలు మాలాటి వాళ్ళ యింట్లో పుడితే అయిదు లక్షల కట్నం యిచ్చి పెళ్ళి చేసి వుండే వాళ్ళం లేదా పెళ్ళి చేసుకుని వుండే వాళ్ళం." అన్నాడు.

సిరి నవ్వుతూ, "ఆ మాట నన్నడక పోతే గూడెంలో వున్న ఏ పిల్లనయినా అనొచ్చుగా" అంది.

అందులోని వ్యంగ్యం అర్థంకాని ఆ మూర్ఖుడు "అంటే" అన్నాడు.

"అంటేనా! పెద్ద కులందాన్ని. మీ యింట్లో పుడితే లక్షలు ఖరీదు చేసేదాన్ని అన్నావు. మమ్మల్ని కులం నుంచి దింపే తెలివి లేనోటే గూడెంలోని పిల్లల్ని పైకెత్తవచ్చు గదా. అప్పుడు వాళ్ళూ పైకొస్తారు. మేమూ కిందకి దిగి వస్తాం. అప్పుడు అందరూ కలిసిపోవచ్చు చక్కగా" అని వివరించింది సిరి.

చెట్టు మీదున్న చింతాలు విరగబడి నవ్వింది. ఉరిమి చూసిన మోతుబరి కొడుకు యిలా అన్నాడు.

"ఎందుకే నవ్వుతావు? నీ యమ్మ మొగుడు సొమ్మనా చింత చెట్టు ఎక్కావు. ఆ చింత చిగురు యిటు పడెయ్. రేపటినుంచి చింతలెక్కావో చీల్చి పడేస్తాను" అన్నాడు.

చింత చిగురుని ప్రాణప్రదంగా పట్టుకుని క్రిందకు దిగిన చింతాలు "యివి వూరి వుమ్మడి చింతలు. మీ య్యా మునసబయ్యా కొట్టుకు చచ్చినా యివి వూరందరికీ చెందిన చింతలే. నువ్వెవడివి చెప్పేటందుకు. అంతగా సిగురు తినాలని వుంటే ఓపాలి మా యింటికిరా. సిగురేసిన శాపలు ఒండెడతా" అంది చమత్కారంగా.

"మీ యింటికొస్తే మీ ఆయన ఏమీ అనడా?" అన్నాడు తగ్గిపోయిన మూర్ఖుడు.

అతనికి సెక్సూ, తిండే తప్ప మరో ఆలోచన లేదు. చింతాలు నవ్వి, "మా ఆయన ఏటంటాడు? మీ యింటికి మా ఆయనొస్తే నీ రూలు పకారం సిరమ్మను మీ యింట్లో పుట్టమన్న పకారం మా యింట్లో నువ్వు పుట్టావనుకుంటాం. బాపనపిల్ల మీ యింట్లో పుట్టాలని, మీరు కోరుకున్నప్పుడు మీరు మా యింట్లో పుట్టాలని మాకుండదా ఏటి. మీరు బాంబల్లను కిందికిలాగితే మేము మిమ్మల్ని కిందికి లాగుతాం. అంతేగా" అంది చింతాలు.

ఈ తర్కానికి ఎదురు చెప్పలేని మోతుబరి కొడుకు దాని మీదకు ఎగబడి దాని ఒళ్ళో వున్న చింత చిగురు లాక్కోపోయినాడు. చింతాలు వూరుకోలేదు.

"చాలు చాల్లే పెద్ద మొగోడివి" అంటూ ఒక్క తోపు తోసింది. పల్లె వీధి సెక్సుతోనూ, కాఫీ హోటల్ తిండితోనూ బలహీనుడైన ఆ మోతుబరి కొడుకు శ్రామికురాలైన చింతాలు తోపుకి మూడు గజాలు దొర్లాడు. అక్కడైనా సిరి పాదాలు అడ్డుగా వుండటం వల్ల ఆగాడు. సిరి అతనిని లేవదీసి "నీ కెందుకురా వెధవ చేష్టలు. ఏదో చిన్ననాటి స్నేహితుడివి చెప్తున్నాను. ఆడవాళ్ళ జోలికిపోబోక ఆరోగ్యం బాగుండాలను కుంటే."

మళ్ళీ ఆ మూర్ఖుడు నన్ను రా అంటావా అని వురిమాడు. "నువ్వు చింతాలుని వుసే అన్నట్టుగానే నేను నిన్ను ఒరే అన్నాను. చిన్ననాటి నుంచీ నిన్ను నేను అలాగే అంటున్నాను. అయినా నీకు యింత పొగరు ఎందుకు ఎక్కిందో అర్థం కావటం లేదు. పొగరు దించుకుంటే కాస్త మంచిది" అని మెల్లిగా సలహా యిచ్చింది.


సిరిని అక్కడకక్కడే అనుభవించాలని కోపం వచ్చినా సిరి చేతిలో బిందె వుండటం వలన తగ్గి చింతాలు మీదకే విరుచుకు పడ్డాడు. కాస్సేపు యిద్దరు ఆడవాళ్ళతోనూ తన్నులు తిని అసభ్యకరమైన కూతలు కూసి యింటికి వెళ్ళి తన మోతుబరి తండ్రితో ఏం చెప్పాడో గాని మర్నాడు చింతాలు మావకూ సిరి తండ్రికీ పిలుపులొచ్చినాయి.

ఆ యిద్దరూ మోతుబరి మోతుబరితనానికి చాలా కాలంగా బానిసలు. కొంచెం కొంచెంగా యిప్పుడిప్పుడే వాళ్ళకు లోకం తెలుస్తున్నది. పరబ్రహ్మశాస్త్రి ధైర్యం చేసి "అయినా అన్నగారూ మనవాడు అలా చింతాలు మీదకు ఎగబడటం అంత మంచి పని కాదు. ఎంతైనా అది వూరి కోడలు గదా. కుల భేదాలు, ధన భేదాలూ యిప్పుడొచ్చినయిగాని మన చిన్నతనంలో వుండేవా చెప్పండి. చింత చిగురు కోసిందే కొగట్టండి. దాని అత్తా కోసింది. దాని అత్త అత్తా కోసింది. అప్పుడు లేని బాధ యిప్పుడేమొచ్చింది" అన్నాడు.

మోతుబరి ఒళ్ళు మండిపోయింది. ఈ బ్రాహ్మడికి తింటానికి సరిగా తిండి లేదు గాని కులగర్వం జాస్తి అని మనస్సులోనే అనుకున్నవాడై చింతాలు మావ వంక తిరిగి

"ఏరా కులం తక్కువ లంజకొడకా. కోడల్ని మా చింతల మీద ఎక్కమనకపోతే వూరి కుర్రాళ్ళ దగ్గర..."

చింతాలు మాల ఒకనాటి శూరులజాతికి చెందిన వాడు. అతను క్రిష్టియన్ కాదు. మతం పుచ్చుకోలేదు. హరిజనుణ్ణి కూడా కాదు అంటాడు. మిలట్రీ మున లయ్య మనవణ్ణి అని గర్వంగా అంటాడు. అలాంటి వాడికి మోతుబరి మాటలు వినేసరికి కళ్ళు ఎర్ర బడ్డాయి. కాని ఏమీ చెయ్యలేని పరిస్థితి. నిశ్శబ్దంగా వెనక్కి వెళ్ళి పోయాడు.



పరబ్రహ్మశాస్త్రి మళ్ళీ కల్పించుకుని "ఏం మాటలు అన్నగారు. కొంచెం వెనకాముందూ వుండాలి. మీ మాటగాని పూర్తి అయి వుంటే వాడు మీ మీద చెయ్యి చేసుకునేవాడు. అప్పుడు. మీ గౌరవం గంగలో కలిసేది. అయినా తప్పు మీదేలెండి" అని సమాధానానికి ఎదురు చూడ కుండా కొల్లాయిగుడ్డ దులుపుకుని భుజాన వేసు కుని వెళ్ళిపోయాడు.

మోతుబరి అన్నగారికి యీ బాపనాడూ, మాలాడూ ఎదురు తిరగటం చూసి ఒళ్ళు మండ పోయింది. శ్రీవారికి మొదటినుంచి మరో కులం వుండకూడదనేది నిశ్చితమైన అభిప్రాయం. అందుకే కొడుకుని పిలిచి యిలా వుపదేశం చేశారు.

"కొజ్జా లంజాకొడకా! యిద్దరు ఆడపిల్లల్ని అక్కడి కక్కడే చిదిమి పారెయ్యక తన్నులు తిని వచ్చావు చాతగాని ఎధవా. వాళ్ళిద్దర్నీ ఏం చేసినా యీ వూళ్ళో అడిగే దిక్కుండంటరా"అని చెయ్యవలసిన కార్యానికి సూచన చేసారు.

ఆ సూచన ప్రకారం తనలాటి యిద్దరు చచ్చు స్నేహితులతో చింత చెట్టు దగ్గరకు వెళ్ళి ఒకడు ఎవరూ రాకుండా చూస్తూ వుంటే యిద్దరు చింతాలు చెయ్యా, సిరి చెయ్యా పట్టుకున్నారు. అంతే బిందె చప్పుళ్ళా, కొడవలి పరపరలూ వినిపించి రక్తం వరదలైంది. మను షులు చావకుండా సిరీ, చింతాలూ జాగ్రత్త పడ్డారు. గాయాల్తో వచ్చిన కొడుకుని చూసి ఉగ్రుడైన మోతు బరి గూడాన్ని తగలబెట్టించాడని సాక్ష్యం చెప్పాడని పరబ్రహ్మశాస్త్రిని జైలుకు పంపించాడు ఆర్నెల్లల్లో. యీ చింత చిగురు కేసు రాజకీయ పార్టీలు భుజాన వేసు కున్నాయి. గూడెంలో మిగిలి వున్న వాళ్ళు రాజకీయ పార్టీల సహకారం మాకొద్దని నినదించారు. మిషనరీలు ఇదే సందని మతం మార్చిడికిగాను ఆ వూళ్ళో మకాం పెట్టారు. మొదట్లో చింత చిగురు కేసుగా అభివర్ణింప బడిన యీ సంఘటన నేడు ఉద్యమమై దేశమంతా పాకింది పత్రికల పుణ్యమా అని.

ఇప్పుడీ కేసు భూస్వాముల్ని హత్య చేయ్యాలనీ, అప్పుడు గాని సమానత్వం రాదని వాదించే క్రాంతికారుల చేతుల్లోకి వెళ్ళిపోయింది. ప్రస్తుతం యీ చింతచిగురు కేసు అంతర్జాతీయ సమస్య. యీ మధ్యలో బ్రాహ్మణ కుటుంబం ఏమయిందని ఎవరూ పట్టించుకోటం లేదు దళితులతో సహా.